వైద్య సేవలు బంద్



ఎన్.సూరవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



తేటగుంటలో డాక్టర్లు, రోగులు లేకపోవడంతో వెలవెలబోతున్న పీహెచ్‌సీ

- సమ్మె బాట పట్టిన పీహెచ్‌సీ డాక్టర్లు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న రోగులు
- అత్యవసర సేవలకూ తప్పని తిప్పలు

తుని రూరల్: మెడికల్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఇన్‌సర్వీస్ కుదించడం, ఇతరేతర సమస్యలు పరిష్కారం కోరుతూ పీహెచ్‌సీ డాక్టర్లు సమ్మె బాట పట్టారు. దీంతో గ్రామీణులకు వైద్యం అందించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు బంద్ అయ్యాయి. మొదటి రోజు సమ్మెలో పాల్గొన్నప్పటికీ డాక్టర్లు ఆస్పత్రులకు వచ్చిన రోగులకు వైద్య సేవలు అందించారు. ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలం కావడంతో మంగళవారం పీహెచ్‌సీలకు వైద్యులు రాలేదు. వివిధ గ్రామాల నుంచి వైద్యం కోసం ఆసుపత్రులకు వచ్చిన రోగులు వెనుతిరిగారు. అత్యవసర వైద్యం అవసరమైన రోగులకు సిబ్బంది ప్రాథమిక చికిత్సలు చేసి మెరుగైన వైద్యం చేయించుకోవాలని సూచించారు.

నియోజకవర్గంలో నాలుగు పీహెచ్‌సీలు

తుని నియోజకవర్గ పరిధిలో తుని మండలంలో రెండు, కోటనందూరు మండలంలో రెండు, తొండంగి మండలంలో నాలుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ప్రతిరోజూ 400 నుంచి 500 మంది రోగులు పీహెచ్‌సీలకు వచ్చి వేర్వేరు చికిత్సలు చేయించుకుంటున్నారు. రెండు రోజులుగా వైద్యసేవలు నిలిచిపోవడంతో వీరంతా తుని, కాకినాడ తదితర పట్టణాలకు వెళ్లిపోవలసి వచ్చింది.

వెలవెలబోయిన పీహెచ్‌సీలు

వైద్యులు సమ్మె చేస్తుండడంతో వైద్య సేవలు నిలిచిపోయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వెలవెలబోయాయి. తుని మండలంలోని ఎన్.సూరవరం, తేటగుంట, కోటనందూరు మండలంలో కొట్టాం, కోటనందూరు, తొండంగి మండలంలో ఏవీ నగరం, రావికంపాడు, కొత్త పెరుమాళ్లపురం, తొండంగి గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వైద్యులు లేకపోవడం, రోగులు సైతం రాకపోవడం, ఆరకొరగా వచ్చిన రోగులకు సిబ్బంది మందులు ఇచ్చి పంపించివేయడంతో ఆస్పత్రులన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. సమ్మె ఎప్పుడు ముగుస్తుందో తెలియకపోవడంతో గ్రామీణ వైద్యసేవలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. కొత్త మెడికల్ సీట్లు వద్దని కేంద్రానికి ప్రభుత్వం లేఖ రాయడం, గత ప్రభుత్వం చేపట్టిన కొత్త మెడికల్ కళాశాల నిర్మాణాలను ఈ ప్రభుత్వం పీపీపీ విధానంలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు నిర్ణయించింది. ఇటువంటి విధానాలతో ప్రజలకు ఉచిత వైద్యసేవలను ప్రభుత్వం దూరం చేస్తుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు వైద్యుల సమ్మె మరింత ప్రభావాన్ని చూపుతుంది.

మందులిచ్చి పంపించేశారు

నన్ను మా ఊరిలో కుక్క కరిచింది. వైద్యం కోసం తేటగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాను. డాక్టర్లు లేకపోవడంతో సిబ్బంది మందులు ఇచ్చి రెండు రోజుల తర్వాత రమ్మని పంపించి వేశారు.
– వై.సత్తిబాబు, టి.వెంకటాపురం, తుని మండలం

డాక్టర్ల సమస్యలు పరిష్కరించాలి

డాక్టర్ల సమ్మె ప్రభావం గ్రామీణులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. డాక్టర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలి. సమస్యలు పరిష్కరించి ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించాలి.
– ఎస్.శ్రీనివాస్, సీఐటీయూ కన్వీనర్, తుని మండలం

క్లుప్తంగా

మైనింగ్ కార్మికుల ఆందోళన

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని వంతాడ లేటరైట్ మైనింగ్ కార్యాలయం వద్ద శుక్రవారం పూర్వ కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ స్థానిక ఆంధ్రు మినరల్స్ మైనింగ్ సంస్థలో 2014 నుంచి సేవలందించిన తమను ఐదేళ్ల క్రితం సంస్థ నష్టాల్లో ఉందని విధుల నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సంస్థ యథావిధిగా కొనసాగుతున్నప్పటికీ తమను తిరిగి విధుల్లోకి తీసుకోలేదన్నారు. తక్షణమే తమను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మత్స్యకారులకు జీఎస్టీపై అవగాహన



తగ్గిన జీఎస్టీపై మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

తొండంగి: కేంద్ర ప్రభుత్వం మత్స్యకారులకు అవసరమయ్యే పరికరాలపై జీఎస్టీని తగ్గించింది. తగ్గిన జీఎస్టీని తీరప్రాంత మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ ఉమామహేశ్వరరావు సూచించారు. మండలంలోని పంపాదిపేట, పెరుమాళ్లపురం, వేమవరం, దానవాయిపేట, వాడముసలయ్యపేట తదితర గ్రామాల్లో మత్స్యకారులకు మంగళవారం తగ్గిన జీఎస్టీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మత్స్యకార పరికరాలు, యంత్రాలు తదితర వాటిపై 12 శాతంగా ఉన్న వస్తు సేవల పన్నును ఐదు శాతానికి తగ్గించిందన్నారు. దీంతో మత్స్యకారులు కొనుగోలు చేసే చేపల వేట ఇంజిన్లు, వలలు తదితర పరికరాలు, చేపల అమ్మకానికి సంబంధించిన వస్తువుల ధరలు భారీగా తగ్గుతాయన్నారు. మత్స్యకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ ఫిషరీస్ అసిస్టెంట్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

క్షేమంగా తిరిగొచ్చిన మత్స్యకారులు

కాకినాడ క్రైం: తమిళనాడుకు బోటు కొనడానికి వెళ్లి తిరిగొస్తూ శ్రీలంక జలాల్లోకి ప్రవేశించిన నలుగురు మత్స్యకారులు క్షేమంగా తిరిగి కాకినాడకు చేరారు. 53 రోజుల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత వారు తమ కుటుంబాలను కలుసుకున్నారు. వివరాల్లోకి వెళితే, ఈ ఏడాది జూలై 19న కాకినాడకు చెందిన పంతాడి బ్రహ్మానందం తమ ప్రాంతానికి చెందిన కర్రి నూకరాజు, చింతా నాగేశ్వరరావు, కొప్పాడి శ్రీనుతో కలిసి తమిళనాడులోని తుతూర్‌కు బోటు కొనడానికి వెళ్లారు. సుమారు రెండు వారాల తర్వాత ఆగస్ట్ 2న కాకినాడకు బయల్దేరారు. మూడో తేదీ సాయంత్రం తమ వెంట కోస్ట్‌గార్డు బోటు రావడాన్ని గమనించారు. బోటు ఆపడంతో కోస్ట్‌గార్డ్ సిబ్బంది వారిని తనిఖీ చేయడం మొదలెట్టారు. ఎందుకు తనిఖీ చేస్తున్నారని ప్రశ్నిస్తే.. శ్రీలంక జలాల్లోకి అక్రమంగా ప్రవేశించి, మూడు కిలోమీటర్లు దూసుకొచ్చారని వారు సమాధానమిచ్చారు. చేసేది లేక తమ బోటును వారికి అప్పగించి, ఆరు గంటల సుదీర్ఘ ప్రయాణం తర్వాత మరో కోస్ట్‌గార్డు సాయుధ బృందానికి వీరిని అప్పగించారు. వీరిని కోర్టులో ప్రవేశపెట్టి జైలు నిర్బంధానికి పంపారు. ఈ విషయం తెలుసుకున్న కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి హుటాహుటిన శ్రీలంక జైలుకు న్యాయవాదితో పాటు నలుగురిని పంపించారు. శ్రీలంకలోని భారత రాయబారి అధికారి వారికి తోడ్పాటునందించారు. ఎట్టకేలకు 53 రోజుల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత కోర్టు ఆదేశాల మేరకు, మత్స్యకారులు మంగళవారం కాకినాడకు చేరుకున్నారు. కోస్ట్‌గార్డు స్టేషన్ వద్ద మత్స్యకారులకు వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధికార ప్రతినిధి సుంకర విద్యాసాగర్, యువజన విభాగం అధ్యక్షుడు రాగిరెడ్డి అనిల్‌కుమార్(బన్నీ) స్వాగతం పలికారు. వారితో పాటు కాకినాడ ఎంపీ ఉదయ శ్రీనివాస్, ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ ఉన్నారు.

మండల అధికారుల నంబర్లు

ఏలేశ్వరం:

తహసీల్దార్	- 98499 03921
ఎండీపీఓ కార్యాలయం	- 98493 36599
ఎంఈఓ	- 94942 10420
ఏపీఓ	- 70939 98217
ఏపీఎం	- 73373 16825
ఎస్సై	- 94409 04835
మండల వైద్యాధికారి	- 99662 06287
నగర పంచాయతీ కమిషనర్	- 96520 65430
మండల వ్యవసాయాధికారి	- 83310 56609
ఫారెస్టు రేంజర్	- 94403 28540

కిర్లంపూడి:

తహసీల్దార్	- 98499 03886
ఎంపీడీఓ	- 91009 70617
ఎంఈఓ	- 90009 12335
ఎంఈఓ-2	- 98487 43433
ఏపీఓ	- 83744 46309
ఏపీఎం	- 96523 04151
ఎస్సై	- 94409 04834
కిర్లంపూడి వైద్యాధికారి	- 77024 41029
వీరవరం వైద్యాధికారి	- 89193 43269
గెద్దనాపల్లి వైద్యాధికారి	- 81066 28018
మండల వ్యవసాయాధికారి	- 83310 56601
కిర్లంపూడి పశువైద్యాధికారి	- 89580 44698
హౌసింగ్ ఏఈ	- 70939 30461
ఇంజినీరింగ్ అధికారి	- 97014 77778



జగ్గంపేటలో డిజిటల్ బుక్, క్యూఆర్ కోడ్‌ను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

అధికారమదంతో అతి చేస్తే భవిష్యత్‌లో గుణపాఠం

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గణేష్ రాజా

జగ్గంపేట: అధికారం ఉందనే గర్వంతో కూటమి నేతలు అతిగా ప్రవర్తించి వైఎస్సార్ సీపీ నేతలను కష్టాలకు గురి చేయడం సరికాదని, కాలం ఎప్పుడూ అనుకూలంగా ఉండదని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రావుల గణేష్ రాజా అన్నారు. జగ్గంపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో డిజిటల్ బుక్, క్యూఆర్ కోడ్‌ను పార్టీ నేతలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టడం, అరెస్టులు చేయించడం, వేధింపులకు గురి చేయడం వంటి చర్యలకు పాల్పడుతోందన్నారు. అన్యాయానికి గురైన బాధితులు తమ పేర్లు, వివరాలను డిజిటల్ బుక్‌లో నమోదు చేస్తామన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తే కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదని, భవిష్యత్ కూటమి నేతలకు గుణపాఠాలు నేర్పుతుందని చెప్పారు. మాజీ మంత్రి, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తోట నరసింహం, పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట శ్రీరాంజీ ఆదేశాలతో ఈ కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. వైఎస్సార్ సీపీ నేతలు కాపారపు ప్రసాద్, భూమాడ గణపతి, కరుటూరి వీర్రాజు, వరుపుల సూరిబాబు, గుర్రం మహాలక్ష్మి, టి.కృష్ణంరాజు, గాది కృష్ణ, పోత్రు వీర్రాజు, సాపిరెడ్డి సత్తిబాబు, రావుల సురేష్‌కుమార్, మొగిలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

100 మందికి కంటి పరీక్షలు

ఏలేశ్వరం: పట్టణంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహిస్తున్న పక్షోత్సవాల్లో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ రాము 100 మందికి కంటి పరీక్షలు చేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని ప్రత్తిపాడు తరలించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గట్టిం వెంకటరమణ, పట్టణ అధ్యక్షుడు రెడ్డి లోవరాజు, రెడ్డి వరలక్ష్మి, కూసి విజయ్‌కుమార్, మలిరెడ్డి పాపరాజు తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో రోగికి కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు రాము

నేరాల దర్యాప్తునకు సీసీ కెమెరాలు దోహదం

తొండంగి: నేరాల దర్యాప్తునకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపతాయని ఒంటిమామిడి దివీస్ ల్యాబొరేటరీస్ సీనియర్ మేనేజర్లు ఆర్.సుధాకర్, బి.వాసుబాబు అన్నారు. దివీస్ సంస్థ సీఎస్ఆర్ నిధులు రూ.12.81 లక్షలతో మండలంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు 16 సీసీ కెమెరాలు సమకూర్చింది. ఒంటిమామిడి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం తొండంగి ఎస్సై బి.జగన్మోహన్‌రావుకు సీసీ కెమెరాలు, కంట్రోల్ సిస్టమ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై జగన్మోహన్‌రావు మాట్లాడుతూ ఒంటిమామిడి, దానవాయిపేట, శృంగవృక్షంపేట, కొత్తపాకలు తీరప్రాంత గ్రామాల్లోని కూడలి ప్రదేశాల్లో వీటిని ఏర్పాటు చేశామని తెలిపారు. వీటి పర్యవేక్షణను పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానం చేసినట్టు చెప్పారు. సీసీ కెమెరాల ఆధారంగా గ్రామాల్లో రహదారి భద్రత, శాంతిభద్రతలు పర్యవేక్షణ, అపరిచిత వ్యక్తుల సంచారం, దొంగతనాలు, దోపిడీ వంటి కేసుల్లో విచారణ మరింత సులభతరం అవుతుందన్నారు. దివీస్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దివీస్ సిబ్బంది జె.సతీష్‌కుమార్, కె.తేజ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



ఎస్సై జగన్మోహన్‌రావుకు సీసీ కెమెరాల కంట్రోల్ సిస్టమ్‌ను అందజేస్తున్న దివీస్ మేనేజర్లు

మురుగు సమస్యకు మోక్షం



'పల్లెతో చెత్తపట్టాల్' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనం



శృంగరాయునిపాలెంలో డ్రైన్‌ను శుభ్రం చేస్తున్న శానిటేషన్ సిబ్బంది

సాక్షి ఇంపాక్ట్

కిర్లంపూడి: మండలంలోని శృంగరాయునిపాలెం, సోమరాయణంపేట, సోమవరం గ్రామాల్లోని డ్రైన్లు పూడుకుపోయి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుంది. అలాగే ఎస్.తిమ్మాపురం రోడ్డు పక్కన వ్యర్థాలు పేరుకుపోయి దోమలకు ఆవాసాలుగా మారడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దీనిపై సోమవారం 'పల్లెతో చెత్తపట్టాల్' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి డిప్యూటీ ఎంపీడీఓ సత్యప్రసాద్ స్పందించారు. శృంగరాయునిపాలెం, సోమరాయణంపేట, సోమవరం గ్రామాల్లోని డ్రైనేజీలను శుభ్ర పరచాలని పంచాయతీ సెక్రటరీలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శానిటేషన్ సిబ్బంది మంగళవారం డ్రైన్లను శుభ్రం చేసి, బ్లీచింగ్ చల్లారు. ఎస్. తిమ్మాపురంలోని రోడ్డు పక్కన ఉన్న చెత్తకుప్పను రెండు రోజుల్లో తొలగిస్తామని సత్యప్రసాద్ తెలిపారు.

కుండపోత వాన

తొండంగి: మండలంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం కుండపోత వర్షం కురిసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఉదయం నుంచి ఉక్కపోత ఎక్కువగా ఉండి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం భారీ కుండపోత వర్షం కురిసింది. పలు గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాతావరణం చల్లబడి ప్రజలు సేదతీరారు.

విశ్రాంత హెచ్‌ఎం మృతి



కోటేశ్వరరావు (ఫైల్)

ప్రత్తిపాడు: గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బర్రే కోటేశ్వరరావు (74) సోమవారం రాత్రి మృతి చెందారు. ఆయన అమలాపురం, కిర్లంపూడి మండలం వీరవరం, గెద్దనాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా సేవలు అందించారు. ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ హెచ్‌ఎంగా పనిచేస్తూ 2009లో ఉద్యోగ విరమణ చేశారు. ఆర్‌ఎస్‌ఎస్, విశ్వ హిందూ పరిషత్ సభ్యుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. యోగా గురువుగా, భారతీయ విద్యా కేంద్రం పాఠశాలలకు కరస్పాండెంట్‌గా వ్యవహరించారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. చినశంకర్లపూడి ఎంపీటీసీ పిల్లా చిన్న, భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా, పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను, విశ్రాంత ఎంఈఓ ముక్కు సుబ్రహ్మణ్యం, మాసా ఇమ్మాన్యుయేల్, ఉపాధ్యాయులు కోటేశ్వరరావు భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పారిశుధ్య కార్మికులకు నేడు సత్కారం

తొండంగి: స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ పారిశుధ్య కార్మికులకు బుధవారం సత్కరించనున్నట్టు ఎంపీడీఓ సాయి నవీన్ తెలిపారు. మండలంలోని పంచాయతీ పారిశుధ్య కార్మికులందరికీ ఉదయం 10.30 గంటలకు సన్మానిస్తామన్నారు. అనంతరం వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు తెలిపారు. సంబంధిత అధికారులు, సిబ్బంది హాజరు కావాలని కోరారు.



లోవలో దుర్గాదేవిగా తలుపులమ్మతల్లి



రత్నగిరిపై దుర్గామాత అలంకరణలో వనదుర్గమ్మ



రత్నగిరిపై దుర్గామాత అలంకరణలో కనకదుర్గ అమ్మవారు



జగపతినగరంలో విశేష అలంకరణలో అమ్మవారు



తాళ్లూరులో సిద్ధిధాత్రిగా అమ్మవారు



ఏలేశ్వరంలో దుర్గాదేవిగా అమ్మవారు



రౌతులపూడిలో దుర్గాదేవిగా అమ్మవారు



కత్తిపూడిలో విశేష అలంకరణలో అమ్మవారు

దుర్గాదేవి నమోస్తుతే..



ఏలేశ్వరంలో బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

- విశేష అలంకరణలో దర్శనమిచ్చిన జగన్మాత కనకదుర్గమ్మ
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

ఏలేశ్వరం: దేవీ శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు పట్టణంలో మంగళవారం మహిళలు బోనాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో స్థానిక తోటవీధి, దిబ్బలపాలెంలోని సంతోషిమాత ఆలయాల వద్ద నుంచి మహిళలు బోనాలతో భారీ ర్యాలీ చేశారు. తొలుత ఆలయాల వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక మెయిన్ రోడ్డు, బాలాజీ చౌక్, దిబ్బలపాలెం, మార్కెట్‌వీధి తదితర ప్రాంతాల మీదుగా ఊరేగింపు సాగింది. నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాల వద్ద మహిళలు కుంకుమ పూజలు చేశారు.

లోవ దేవస్థానంలో...

తుని రూరల్: లోవ దేవస్థానంలో కొలువైన తలుపులమ్మ అమ్మవారు మంగళవారం దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాల్లో భాగంగా వేద పండితులు, ప్రధాన అర్చకులు తొమ్మిదో రోజు అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం మహాచండీ హోమం నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. పదో రోజు బుధవారం మహిసాసురమర్దిని అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్టు అధికారులు తెలిపారు.

రౌతులపూడి: దేవీ శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా స్థానిక సినిమా సెంటర్‌లో వేంచేసిన కనకదుర్గమ్మ మంగళవారం ఎనిమిదో రోజు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. రాత్రి ఆలయం వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

దుర్గామాత అలంకరణలో అమ్మవార్లు

తొండంగి: దసరా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దుర్గాష్టమి కావడంతో రత్నగిరిపై వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లు దుర్గామాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రత్నగిరి ప్రధానాలయంలో అనంతలక్ష్మి సత్యవతీదేవి అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. కొండపై మెట్ల మార్గంలో ఉన్న వనదుర్గ అమ్మవారి ఆలయంలోనూ, కొండదిగువ తొలిపావంచా వద్ద కనకదుర్గమ్మ ఆలయంలోనూ అమ్మవార్లకు దుర్గామాత అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రుత్వికులు లక్ష కుంకుమార్చన, మహదాశీర్వచనం, వేద స్వస్తి వంటి వైదిక కార్యక్రమాలు నిర్వహించారు.

కిర్లంపూడి: శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా జగపతినగరంలోని అభయదుర్గమ్మ, కిర్లంపూడిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి, చిల్లంగి, రామచంద్రపురం, వీరవరం, బూరుగుపూడి, సోమరాయణంపేట గ్రామాల్లోని కనకదుర్గ అమ్మవార్లు మంగళవారం దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో వేంచిసిన దుర్గాదేవి అమ్మవారు మంగళవారం సిద్ధదాత్రిగా భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శంఖవరం: దేవీ శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా జగన్మాత కనకదుర్గమ్మ మంగళవారం దుర్గాదేవి అవతారంలో దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తిగీతాలతో భజనలు చేశారు. భక్తులకు ప్రసాదాలు పంచారు.

అన్నసమారాధన

ప్రత్తిపాడు: దసరా ఉత్సవాల్లో భాగంగా ప్రత్తిపాడు జాతీయ రహదారిపై అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద వేంచేసిన దుర్గమ్మ ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి తదితరులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు నిర్వహించారు. అన్న సమారాధనలో ప్రత్తిపాడు, రాచపల్లి, ధర్మవరం తదితర గ్రామాల ప్రజలు పాల్గొని అన్న ప్రసాదాలను స్వీకరించారు.

అమ్మవారిని దర్శించుకున్న మురళీకృష్ణంరాజు



కాకినాడ శ్రీపీఠంలో అమ్మవారిని దర్శించుకున్న మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: కాకినాడ శ్రీపీఠంలో నిర్వహిస్తున్న శరన్న నవరాత్ర ఉత్సవాల్లో మంగళవారం వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, లోవలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. శ్రీపీఠంలోని బగళాముఖిదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహాశక్తి యాగం, హోమాలు, విశేష పూజ, శతకోటి కుంకుమ పూజ, లక్ష నిమ్మకాయల పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.